AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
17-10-2026 (Saturday)
MAIN EDITION

దసరా రోజు పాలపిట్టను ప్రదర్శిస్తే కఠిన చర్యలు



అక్షరటుడే, హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా దసరా పండుగను ఘనంగా జరుపుకుంటారు. ఆ రోజు పాలపిట్టను చూస్తే మంచి జరుగుతుందని ప్రజలు నమ్ముతారు. దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది పాలపిట్టను బంధించి, ఆయాలు, దసరా మండపాల్లో ప్రదర్శిస్తున్నారు. ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర పక్షి అయిన 'పాలపిట్ట'ను దసరా మండపాల్లో ప్రదర్శించే వారిపై కేసులు నమోదు చేస్తామని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.

పులివెందులలో ఉద్రిక్తత



అక్షరటుడే, ఏపీ : కడప జిల్లా పులివెందుల నామినేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది. నామినేషన్ కేంద్రం వద్దకు పెద్ద సంఖ్యలో టీడీపీ, వైసీపీ నాయకులు వచ్చారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన వైసీపీ అభ్యర్థులపై టీడీపీ కవ్వింపు చర్యలు చేపట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టేందుకు గాల్లోకి కాల్పులు జరిపారు.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు



అక్షరటుడే, హైదరాబాద్: ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. అహ్మదాబాద్ - హైదరాబాద్ విమానంలో బాంబు ఉందని మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ప్రయాణికులను దించేసి, విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించారు. బాంబ్, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.

రైతులకు అలర్ట్.. నేటి నుంచి వర్షా లు




అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : తెలంగాణలోని పలు ప్రాంతాల్లో నేటి నుంచి అక్కడక్కడ వర్షా లు కురిసే అవకాశం ఉంది. ఈశాన్య రుతుపవనాల రాకతో నాలుగు రోజులుగా ఛత్తీస్‌గఢ్ సరిహద్దు జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురుస్తున్నాయి. శనివారం నుంచి ఇతర జిల్లాల్లో సైతం వర్షా లు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

రైతుల కోసం ఐపఎస్, ఐపీఎస్ అధికారుల విరాళం



అక్షరటుడే, మహారాష్ట్ర: ఎల్‌నినో ప్రభావంతో మహారాష్ట్రలో కరువు తాండవం చేస్తోంది. అక్కడి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రైతులకు అండగా నిలిచేందుకు ఆ రాష్ట్ర ఐపఎస్, ఐపీఎస్ అధికారులు ముందుకు వచ్చారు. అక్టోబర్ నెలలోని ఒక రోజు జీతాన్ని సీఎం సహాయ నిధికి విరాళంగా ఇస్తామని ప్రకటించారు.

మహిళ ప్రాణాలు తీసిన యువకుల కారు రేసింగ్



అక్షరటుడే, మహబూబ్‌నగర్ : యువకుల కారు రేసింగ్ సరదా ఓ కుటుంబాన్ని రోడ్డు పడేసింది. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌కు చెందిన షాకీర్, భార్య షహానా బేగం, కూతురు ఆయారాతో కలిసి బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో కొందరు యువకులు థార్ కార్లతో రోడ్డుపై రేసింగ్ చేస్తున్నారు. అమిస్తాపూర్ యూపీఎస్ స్కూల్ వద్ద వారి కార్లు ఒకదాని తర్వాత ఒకటి బైక్‌ను ఢీకొట్టాయి. దీంతో షహానా బేగం తీవ్రంగా గాయపడిన అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త షాకీర్‌కాళ్లు చేతులు విరగడంతో పరిస్థితి విషమంగా ఉంది.


రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం : మంత్రి పొన్నం ప్రభాకర్



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా, రాష్ట్ర, జిల్లా స్థాయిలలో రహదారి భద్రతా నిధుల సమర్థ నిర్వహణ, పర్యవేక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. రహదారి భద్రతా సెస్ మొత్తాన్ని రోడ్ల అభివృద్ధికి కేటాయించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర రహదారి భద్రతా మండలి ద్వారా ఈ నిధులను ఖర్చు చేస్తామని చెప్పారు.

రష్యా నుంచి క్రూడాయిల్, గ్యాస్ కొనుగోలు చేస్తున్న భారతదేశంతో పాటు మరో ఐదు దేశాలకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారీ ఉపశమనం ఇచ్చారు. రష్యా ఇంధన దిగుమతులపై 100 శాతం వరకు ప్రతిపాదించిన దిగుమతి సుంకాల (టారిఫ్‌లు) అమలను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆయన ఒక కీలక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. జాతీయ ప్రయోజనాలు, గ్లోబల్ మార్కెట్‌లో ఇంధన ధరల నియంత్రణను దృష్టిలో ఉంచుకునే ఈ వెసులుబాటు కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు.

- అక్షరటుడే, నేషనల్ డెస్క్



భారీ రిలీఫ్

■ రష్యా చమురు దిగుమతులపై టారిఫ్‌ల రద్దు ■ ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

ప్రపంచ మార్కెట్‌లో ధరల స్థిరత్వం కోసం రష్యా నుంచి మొదట 3 లక్షల టన్నులకు పైగా డీజిల్ దిగుమతి చేసుకునేందుకు అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఒప్పందం కుదిరినట్లు ట్రంప్ వెల్లడించారు. అమెరికా కాంగ్రెస్ అక్టోబర్‌లో ఆమోదించిన 'ది లిండ్సే ఓ. గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' చట్టం ప్రకారం.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై ఏకంగా 100 శాతం పన్నులు విధించే అధికారం వైట్‌హౌస్‌కు లభించింది. ఒకవేళ ఈ పన్నులు అమలులోకి వచ్చి ఉంటే భారత్‌కు తీవ్ర నష్టం వాటిల్లేది. ఎందుకంటే మన దేశం తన ఇంధన అవసరాల్లో 88 శాతానికి పైగా దిగుమతుల పైనే ఆధారపడుతోంది. ఒక్క ఆగస్టు నెలలోనే భారత మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా ఏకంగా 45 శాతంగా నమోదైంది.

భారత వైఖరి..

ఈ పరిణామంపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ.. గ్లోబల్ మార్కెట్‌లో లభ్యత, దేశ ఇంధన భద్రత ప్రాతిపదికన మాత్రమే భారత నిర్ణయాలు ఉంటాయని పునరుద్ఘాటించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హొర్మూజ్ జలసంధిలో రవాణా ఆటంకాల వల్ల అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉండటంతోనే, అమెరికా ఈ ఆంక్షలను పక్కన పెట్టిందని విశ్లేషకులు భావిస్తున్నారు. రష్యా చమురును మార్కెట్ నుంచి పూర్తిగా తొలగిస్తే ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరుగుతాయని గ్రహించిన ట్రంప్ యంత్రాంగం ఈ సుంకాల మినహాయింపు నిర్ణయం తీసుకుంది.

తెలంగాణ జల హక్కులు తాకట్టు పెట్టిన సీఎం



అక్షరటుడే, జూబ్లీహిల్స్ : సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ నీటి హక్కులను ఆంధ్రాకు తాకట్టు పెట్టి, రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో లేని క్రాప్ holiday తెలంగాణలో ఎందుకని హరీశ్‌రావు ప్రశ్నించారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానం పేరిట చంద్రబాబు నాయుడు తెలంగాణకు ద్రోహం చేసేలా కుట్రకు తెరలేపారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతున్నా.. రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఇలాంటి కుట్రలను అడ్డుకున్నామని చెప్పారు.

'నితీష్ కుమార్ కోసం 9 మందిని చంపించా'



అక్షరటుడే, బీహార్: బీహార్‌లో జేడీయూ ఎమ్మెల్యే అనంత్ కుమార్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత నితీష్ కుమార్ కోసం తాను 9 మందిని చంపించానని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి. శాసనమండలి ఎన్నికల్లో తన రాజకీయ ప్రత్యర్థి నీరజ్ కుమార్‌కు పార్టీ టికెట్ ఇవ్వడంపై అనంత్ సింగ్ అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలో ఆయనను విమర్శిస్తూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. నితీష్ కుమార్‌తో తనకు చాలా కాలంగా పరిచయం ఉందన్నారు. ఆయనకు సహాయపడేందుకు తాను తొమ్మిది మందిని హత్య చేయించానని చెప్పారు. ఆయన రాజకీయంగా నిలదొక్కుకోవడానికి కష్టపడుతున్న సమయంలో తాను అండగా నిలిచానని అన్నారు. ఈ వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదని జేడీయూ పేర్కొంది.

వరంగల్‌లో ట్రై సిటీస్ హాఫ్ మారథాన్

అక్షరటుడే, వరంగల్ : యువతలో క్రీడాస్ఫూర్తిని పెంచడంతో పాటు ఆరోగ్యంపై చైతన్యం నింపేందుకు మారథాన్‌లు ఎంతో దోహదపడతాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కొనియాడారు. నాయిని విశాల్ ట్రస్ట్, క్రెడాయ్ వరంగల్ ఉమ్మడి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ట్రై సిటీస్ హాఫ్ మారథాన్-2026' రెండో ఎడిషన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రోజూ వ్యాయామం, ఆటలు, ధ్యానం చేయడం వల్ల మానసిక ఒత్తిడి, ఆందోళనలతో పాటు పలు ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని తెలిపారు.

మ్యాగీ తిని ఒకే కుటుంబంలోని ఐదుగురు మృతి!



అక్షరటుడే, యూపీ : ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో అత్యంత హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. రబుపురా పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో తల్లిదండ్రులతో పాటు ముగ్గురు చిన్నారులు ఉన్నారు. ఆ కుటుంబం రాత్రి సమయంలో చివరిగా టీ తాగి, మ్యాగీ తిన్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాతే కుటుంబ సభ్యులంతా అస్వస్థతకు గురై మరణించి ఉంటారని అనుమానిస్తున్నారు. ఫుడ్ పాయిజనింగ్ లేదా ఏదైనా ప్రమాదకర పదార్థం అధిక మోతాదులో తీసుకోవడం వల్లే ఈ మరణాలు సంభవించి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్‌వేపై బస్సు బోల్తా.. 8 మంది మృతి



అక్షరటుడే, రాజస్థాన్: రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కోటాలో శనివారం తెల్లవారుజామున ఢిల్లీముంబై ఎక్స్ ప్రెస్‌వేపై ఓ బస్సు బోల్తా పడి గుంతలో పడిపోయింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందగా, 17 మంది గాయపడ్డారు. భోపాల్ నుంచి ఖాటు శ్యామ్‌కు వెళ్తున్న బస్సు కోటా సమీపంలో ప్రమాదానికి గురైంది. ప్రమాద సమయంలో బస్సులో 27 మంది ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ కునుకు తీయడంతో బస్సు అదుపు తప్పి, రెయిలింగ్‌ను ఢీకొని గుంతలో పడిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

ఇంజినీర్ ఇంట్లో నోట్ల కట్టలు..



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : ఒడిశాలోని ఓ ఇంజినీర్ కారు, నివాసాల్లో భారీగా నోట్ల కట్టలు లభ్యం అయ్యాయి. కాంట్రాక్టర్ల నుంచి లంచాలు వసూలు చేస్తున్నారనే సమాచారం మేరకు కటక్ జిల్లా మహానది నార్తర్న్ డివిజన్‌కు చెందిన సూపరింటెండింగ్ ఇంజినీర్ ప్రసన్‌జిత్ దాస్‌పై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. ఆయన ప్రయాణిస్తున్న వాహనంలో రూ. 7,28,620 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన అద్దె ఫ్లాట్‌లో జరిపిన సోదాల్లో రూ. 14,60,000 నగదు లభ్యమైంది.